సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 16 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.33,690
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,690 పలికాయి. మార్కెట్‌కు 76 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.1°/19.4°
జిల్లాలో శుక్రవారం ఉపామ వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

18న కనకదాస జయంతి వేడుకలు

ప్రశాంతి నిలయం: జిల్లా కేంద్రంలోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18న కనకదాస జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కనకదాస చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు ఆయన ఆదర్శాలను గుర్తుచేసుకోనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు కార్యక్రమానికి హాజరు కోరారు.

అమరనాథరెడ్డి ఇంటికి విశాఖ పోలీసులు



అమరనాథ్‌రెడ్డి ఇంటి గేట్‌కు నోటీసులు అతికించిన పోలీసులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డి ఇంటికి శుక్రవారం విశాఖ పోలీసులు వచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడన్న కారణంగా విశాఖపట్నం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావడంతో అమరనాథ్‌రెడ్డిని విచారించేందుకు ఇక్కడికి వచ్చారు. అమరనాథ్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లో లేక పోవడంతో గేటుకు నోటీసులు అతికించి వెళ్లారు. ఇప్పటికే అమరనాథ్‌రెడ్డిపై మూడు కేసులుండగా ఇది నాలుగో కేసు.


జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు అస్వస్థత



సీఈఓను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) లక్కిరెడ్డిపల్లె వెంకటసుబ్బయ్య శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి బయలుదేరి వెళ్లిన ఆయన కాసేపటికే అస్వస్థతకు గురయ్యారు. దీంతో విషయాన్ని కలెక్టర్‌కు వివరించి ఆయన సలహా మేరకు స్థానిక కార్పొరేట్ ఆస్పత్రికి సిబ్బంది తరలించారు. ఆయన్ను అత్యవసర విభాగంలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. విశ్రాంతి లేకుండా పని చేయడం, ఒత్తిడికి గురవడంతో ఇలా జరిగిందని వైద్యులు చెప్పినట్లు తెలిసింది. మెరుగైన వైద్య సేవలందించి, విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. సమాచారం తెలియగానే అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె నుంచి సీఈఓ కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురం వచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కూడా ఆస్పత్రికి చేరుకుని సీఈఓను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

ప్రజావసరాలకు ఉచితంగా ఇసుక



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: నదీ సమీపంలోని గ్రామాల ప్రజలు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని సంబంధిత రెవెన్యూ అధికారి అనుమతితో స్వంత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లొచ్చునని, ఇందుకు అధికారులు సహకరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్‌కుమార్ మీనా అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చేతన్ జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకూ నెల రోజుల పాటు మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కొత్త మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకునే వారిని గ్రామస్థాయిలో గుర్తించి ప్రత్యేకంగా బహుమతులు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా మైన్స్ అధికారి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి చెందిన 30 ఏళ్ల మహిళ తిన్న ఆహారం జీర్ణం కాలేదని ఆస్పత్రిలో చేరింది. కడుపు నొప్పితో పాటు ఆకలి మందగించినట్లు డాక్టర్లకు తెలిపింది. పలు వైద్య పరీక్షల అనంతరం కల్తీ ఆహారం తినడం కారణంగానే ఆరోగ్య సమస్య తలెత్తినట్లు వైద్యులు నిర్ధారించారు. కల్తీ నూనె, మసాలా పదార్థాలు తినడం తగ్గించాలని డాక్టర్లు సూచించారని ఆమె తెలిపింది.

పెనుకొండలో ఓ చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ఐదు కుటుంబాలు విందులో పాల్గొనేందుకు హోటల్‌కు వెళ్లాయి. వాళ్లందరూ రకరకాల వంటకాలు తిన్నారు. చివరగా ఇంటికి చేరే సమయంలో దారిలో కనిపించిన స్ట్రీట్ ఫుడ్ కూడా రుచి చూశారు. ఎక్కడ తేడా కొట్టిందో తెలీదు. కానీ ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫుడ్ పాయిజనింగ్‌గా తేల్చారు.



పొయ్యిపై సల.. సల..
ఆరోగ్యం విల విల!

- పదే పదే కాగుతున్న నూనెతో ఆరోగ్యానికి చేటు
- ప్రజారోగ్యాన్ని పట్టించుకోని హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు
- కల్తీ నూనెతో ఆస్పత్రుల పాలవుతున్న జనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సాక్షి, పుట్టపర్తి

నిత్యావసర సరుకుల ధరలతో పాటు వంట నూనె ధరలు విపరీతంగా పెరిగాయి. కానీ వాడకం మాత్రం తగ్గడంలేదు. మరోవైపు హోటళ్లలో తిండి ధరలు ఉన్నఫలంగా పెంచడం కుదరదు. దీంతో చాలా మంది కల్తీనూనె వాడటం మొదలుపెట్టారు. దీనికితోడు పొయ్యిపై నూనెను పదే పదే మరిగించేస్తున్నారు. ఫలితంగా తాజా నూనె అయినప్పటికీ మరిగించడంతో రుచి మారుతోంది. ఆ నూనెలో తయారు చేసిన పదార్థాలను తింటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పట్టణ ప్రాంతాల్లో తరచూ వెలుగు చూస్తున్నాయి. రోడ్డు పక్కన తయారు చేసే ఆహార పదార్థాలు దుమ్ము, ధూళి రేణువులు చేరి అనారోగ్యానికి గురి చేస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

పట్టణాల్లోనే అధికం..

పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే హోటళ్లు అధికం. అందులో రోడ్ల పక్కన చిన్న చిన్న హోటళ్లు, తోపుడు బండ్లు ప్రతి వంద మీటర్లకు ఒకటి కనిపిస్తాయి. ఇతర ప్రాంతాల నుంచి పలు పనులపై వచ్చే వాళ్లు గత్యంతరం లేక ఇక్కడే తినాల్సి వస్తోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ప్రధాన కూడళ్లలోని హోటళ్లలో ఎక్కువ మంది ఆహార పదార్థాలను తింటుంటారు. అయితే నూనెను పదే పదే మరిగించడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

ఉదయం నుంచి రాత్రి దాకా..

మద్యం దుకాణాల సమీపంలోని చికెన్ కబాబ్ సెంటర్లలో ఎక్కువసార్లు మరిగించిన నూనెలో చేసిన పదార్థాలను తినడం కారణంగా మందుబాబులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మద్యం కంటే కల్తీ నూనె పదార్థాలు ఎక్కువగా ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయనే విషయం మత్తులో గమనించలేకపోతున్నారు. మటన్, చికెన్, కోడిగుడ్ల వంటకాల్లో ఎక్కువగా కల్తీ జరుగుతున్నట్లు తెలిసింది. ప్రైవేటు మద్యం దుకాణాలు రావడంతో ఒక్కో దుకాణం వద్ద పదుల కొద్దీ చికెన్ కబాబ్ సెంటర్లు వెలిశాయి. ఒకసారి పొయ్యి పెట్టిన నూనె సాయంత్రం వరకూ కాగుతూనే ఉంటోంది. ఫలితంగా ఆ ఆహారాన్ని తీసుకునే వారు ఫుడ్ పాయిజన్‌తో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

అటకెక్కిన తనిఖీలు..

పదే పదే మరిగించిన నూనెలో వంటకాలు చేయడం .. ఆ పదార్థాలు తిన్న వారు అనారోగ్యం బారిన పడటం.. సైకిల్ చక్రంలా స్పష్టంగా కనిపిస్తోంది. అయినా ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు లేకపోవడంతోనే ఇదంతా జరుగుతోందన్న విమర్శలున్నాయి. ఫిర్యాదులు వస్తే కానీ తనిఖీలు చేయరని అంటున్నారు. మరి కొన్ని చోట్ల ఆర్నెల్లకు ఒకసారి కూడా తనిఖీలు చేయడం లేదని రికార్డులు చెబుతున్నాయి. పండుగ సమయంలో మాత్రమే అడపాదడపా తనిఖీలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. నూనె డబ్బాల్లో ఎంతమేరకు కల్తీ ఉందనే విషయం ఎవరూ బయటపెట్టడంలేదు. కబేళాలకు తరలించే పశువుల ఎముకల పిండి కూడా నూనెలో కలిపేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

రోగాలు ఇలా..

ఒకసారి వాడిన వంటనూనెను మళ్లీ మళ్లీ వినియోగించడం వల్ల ఆరోగ్యానికి చేటు కలిగిస్తుంది. మోతాదుకు మించి మరిగిన నూనెలో టోటల్ పోలార్ కౌంట్ (టీపీసీ) 25 శాతానికి మించి శరీరానికి హానికరంగా మారుతుంది. అలాంటి నూనెతో ఆహార పదార్థాలు వండితే శరీరంలో అధికంగా ఫ్రీరాడికల్స్ పెరిగిపోతాయి. నూనె రంగు మారిపోతుంది. అడుగున నల్లటి పదార్థం తయారవుతుంది. ఆమ్లం అధికమవుతుంది. కొన్ని నూనెలలో నిల్వ ద్వారా విష పదార్థాలు కూడా ఏర్పడతాయి. స్థూలకాయం, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్‌తో సహా చాలా వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కల్తీ అని తేలితే కఠిన చర్యలు



మా సిబ్బంది ఆధ్వర్యంలో నిత్యం తనిఖీలు జరుగుతున్నాయి. అయితే ఎక్కడ కల్తీ జరుగుతోందో పక్కా సమాచారం ఇస్తే.. తనిఖీ ముమ్మరం చేస్తాం. శ్యాంపిళ్లు తీసి ల్యాబ్‌కు పంపిస్తాం. కల్తీ చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తప్పవు. ఇప్పటికే చాలా చోట్ల తనిఖీలు చేశాం. కల్తీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నాం. ప్రజలు బయట ఫుడ్ తినడం తగ్గిస్తే ఆరోగ్యం బాగుంటుంది.

– రామచంద్ర, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పుట్టపర్తి

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. మంచి ఆహారంతోనే ఆరోగ్యం బాగుంటుంది. బయట ఎక్కడ పడితే అక్కడ హోటళ్లలో తింటే అనారోగ్యం బారిన పడటం ఖాయం. మసాలా, నూనె వంటలు తినడం తగ్గించాలి. నూనె వంటకాలతో కొవ్వు శాతం పెరగడంతో పాటు కల్తీ నూనె వంటకాలు తింటే వివిధ రోగాలు సోకే ప్రమాదం ఉంది.

– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్ఓ

బిర్సా ముండా పోరాటం ఆదర్శనీయం



బిర్సా ముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో బిర్సా ముండా ప్రముఖ పాత్ర పోషించారు.. ఆయన పోరాటం నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ టీఎస్ చేతన్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర సంగ్రామంలో భాగంగా 1894 సంవత్సరం అక్టోబర్ 1న జార్ఖండ్ రాష్ట్రం కుంతీ జిల్లా ఉలిహతు ప్రాంతంలోని ముండాలందరిని సమీకరించి పన్ను మాఫియా కోసం ఒక ఉద్యమం ప్రారంభించారన్నారు. పేదల పక్షాన నిలబడి పలు పోరాటాలు చేస్తూ పోరాట స్ఫూర్తిని రగిలించారన్నారు. 1900 సంవత్సరం జూన్ 9న ఆయన స్వాతంత్య్ర సమరయోధుడిగా తుది శ్వాస విడిచారన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏఓ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు



భద్రత ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం: సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రశాంతి నిలయానికి తరలిరానున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా ప్రశాంతి నిలయంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఎస్పీ వి.రత్న తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్పీ సత్యసాయి విమానాశ్రయం, ప్రశాంతి నిలయం ప్రవేశ ద్వారాలు, సాయికుల్వంత్ సభా మందిరం, పూర్ణచంద్ర ఆడిటోరియం, శాంతిభవన్ అతిథి గృహం, మహానారాయణ సేవ నిర్వహించే మైదానంతో పాటు ప్రశాంతి నిలయంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించారు. భద్రతా చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. సత్యసాయి జయంత్యుత్సవాల్లో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదన్నారు. అవసరమైన సిబ్బందిని అందుబాటులో పెట్టుకోవాలన్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజును కలసి వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ జెడ్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మార్కెట్‌కు శుక్రవారం 200 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా.. మొదటి రకం క్వింటా రూ. 18 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం 7 వేలు పలికాయి. వాతావరణ మార్పుతో పూర్తిస్థాయిలో ఎండిన సరకు మార్కెట్‌కు రావడం తక్కువైందని మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. రైతులు బాగా ఎండించిన సరుకు తీసుకువస్తేనే మంచి ధరలు లభిస్తాయన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: 'ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరికాదు. విజయవాడ వరద బాధితుల కోసం కేవలం అగ్గిపెట్టెల కోసమే రూ.23 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించడం నిజం కాదా? ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అన్యాయం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగలూరులో సర్పంచ్ సునందమ్మ భర్త గోపాలప్ప మృతి చెందడంతో గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అంటూ జోరుగా ప్రచారం చేశారని, ప్రస్తుతం ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో మాత్రం సంక్షేమ పథకాలకు డబ్బు కేటాయించకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే రూ.75 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. బీసీ సంక్షేమ పథకాలకు ఎందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదో మంత్రి సవిత ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కే నైజం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కి లేదన్నారు. ఇచ్చిన మాట ఇచ్చినట్లుగా నిలబెట్టుకొనే నైజం ఒక్క జగన్‌కే ఉందన్నారు. ఆమె వెంట వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు బాబు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలని మోసం

- ఫైనాన్స్ సంస్థ కార్యాలయానికి తాళం వేసిన బాధితులు



ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయం వద్ద బాధితులు

మడకశిర: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ కస్టమర్లను మోసగించింది. ఈసంస్థలో బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు పొందిన కస్టమర్లు మోసపోయారు. చివరకు మోసపోయిన బాధితులు 100కు కాల్ చేసి ఈసంస్థపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే.. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆశీర్వాద్ గోల్డ్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయం ఉంది. పలువురు తమ అవసరాల నిమిత్తం బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు పొందారు. ఈక్రమంలో ఆ సంస్థలో పని చేసే ఓ ఉద్యోగి బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టిన కస్టమర్లు రుణాన్ని చెల్లించడానికి వస్తే కట్టించుకోకుండా ఫోన్‌పే చేయించుకున్నాడు. అయితే ఆ ఉద్యోగి ఈ డబ్బును రుణానికి జమ చేయకుండా స్వాహా చేశాడు. బంగారు ఆభరణాలపై రూ.40 వేలు అప్పు తీసుకోగా.. ఇంకా ఎక్కువ తీసుకున్నట్లు నమోదు చేసుకుని మరోవ్యక్తిని మోసగించాడు. బేగార్లపల్లికి చెందిన జయమ్మ అనే మహిళ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.40 వేలు అప్పు తీసుకుంది. కూతురి వివాహం కోసం డబ్బులు చెల్లించి బంగారు ఆభరణాలు విడిపించుకోవడానికి వచ్చింది. అయితే రూ.లక్ష అప్పు తీసుకున్నావని, రూ.10 వేలు మాత్రమే చెల్లించావని, మిగిలిన రూ.90 వేలు చెల్లించి బంగారు ఆభరణాలు తీసుకెళ్లాలని చెప్పడంతో ఆమె షాక్‌కు గురైంది. ఇలా ఈ సంస్థ మోసాలు ఒక్కొక్కటీ బయటపడుతున్నాయి. చివరకు జయమ్మతో పాటు మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు సంస్థ కార్యాలయానికి తాళం వేశారు. ఆ తర్వాత పోలీసులు సంస్థ కార్యాలయం వద్దకు చేరుకుని ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న సాయికిరణ్ అనే వ్యక్తి ఆ సంస్థకు చెందిన రూ.13 లక్షల డబ్బు వాడుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. 13 మంది ఖాతాదారులను అతను మోసం చేసినట్లు గుర్తించామన్నారు. అతన్ని ఇప్పటికే ఆ సంస్థ సస్పెండ్ చేసిందని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆరనీకుమా ఈ దీపం..



పుట్టపర్తి: కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి రథోత్సవం..



కదిరి: ఖాద్రీశుని ఆలయంలో జ్వాలాతోరణం



రొద్దం: పెన్నానది ఒడ్డున కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హిందూపురం: మేళాపురం శివాలయంలో కార్తీక దీపాలు..

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కదిరిలోని ఖాద్రీశుని ఆలయంతో పాటు ప్రధాన ఆలయాల్లో జ్వాలాతోరణం నిర్వహించారు.

– సాక్షి, పుట్టపర్తి:

క్లుప్తంగా

రేపు పంపనూరులో కోటి దీపోత్సవం

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంలో ఈ నెల 17న కోటి దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ బాబు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం ఆలయంలో పంచామృతాభిషేకాలతో పాటు, తులసీదామోదర కల్యాణోత్సవం ఉంటుంది. సాయంత్రం ఆలయంలో విశేష హారతులు, జ్వాలా తోరణంతో పాటు కోటి దీపోత్సవం నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా పటిష్ట ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచనున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాత్రి సమయాల్లో ఇబ్బంది పడకుండా ప్రత్యేక బస్సులనూ ఏర్పాటు చేశారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి శివప్రసాదయాదవ్



ధర్మవరం సబ్ జైలులోని బ్యారక్‌ను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శివప్రసాదయాదవ్

ధర్మవరం అర్బన్/హిందూపురం: సత్ప్రవర్తనతో మెలుగుతూ విడుదలైన అనంతరం కుటుంబసభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని సబ్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాదయాదవ్ సూచించారు. శుక్రవారం ఉదయం ధర్మవరం, హిందూపురంలోని సబ్ జైళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వంట గది, స్టోర్ రూం, బ్యారక్‌లు, రికార్డులు పరిశీలించారు. ఖైదీలతో సమావేశమై అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. కోర్టు కేసుల్లో వాదనలు వినిపించేందుకు న్యాయవాది లేకపోతే లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హిందూపురంలో గాయాలతో ఇబ్బంది పడుతున్న ఖైదీలను గుర్తించి, వారికి తక్షణమే చికిత్స చేయించాలని సబ్‌జైలు అధికారి హనుమన్నకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ధర్మవరంలో సబ్ జైలు సూపరింటెండెంట్ బ్రహ్మానందరెడ్డి, న్యాయవాది బాలసుందరి, జైలు సిబ్బంది, హిందూపురంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, న్యాయవాదులు సుదర్శన్, నవేరా, హెబ్సా, శివ, లోక్ అదాలత్ సిబ్బంది హేమవతి తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ధర్మవరం అర్బన్: స్థానిక శివానగర్‌లో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. శివానగర్‌లోని ఒకే ఇంటిలో ఆచారి, శివ అద్దెకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శివ మిద్దెపైకి వెళుతుండగా అక్కడే ఉన్న ఆచారి తనకు చెప్పకుండా పైకి ఎలా వెళ్తావంటూ శివతో గొడవ పడ్డాడు. ఆ సమయంలో మాటామాట పెరగడంతో ఆచారి ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకువచ్చి శివపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన శివ కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వెంటాడుతున్న రక్తహీనత



- మాతృ మరణాలకు ప్రధాన కారణం రక్తహీనతే
- గ్రామీణ ప్రాంత గర్భిణుల్లో ఎక్కువగా ఇదే సమస్య
- రక్తహీనత బాధితులు 58.6 శాతం మంది
- ఆస్పత్రుల్లో సకాలంలో లభించని ఐరన్, విటమిన్ మాత్రలు
- కాన్పుల సమయంలో తీవ్ర దుష్ప్రభావం చూపుతున్నట్టు వెల్లడి

అనంతపురం జిల్లాలో ఏటా ప్రసవాలు	46,000 వరకు
శ్రీసత్యసాయి జిల్లాలో ఏటా ప్రసవాలు	39,000
తీవ్ర రక్తహీనతతో ఉన్న గర్భిణులు	40,000 పైనే
ఏటా గర్భస్థ మరణాలు	2,700 వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మహిళల్లో రక్తహీనత (ఎనీమియా) ప్రధాన సమస్యగా మారింది. ఇది నియంత్రించడం, నివారించదగ్గదే అయినా సాధ్యం కావడం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత సమస్యతో వేలాది మంది మహిళలు చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు మహిళల్లో ఈ లోపం ఎక్కువగా ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. సగటున ప్రతి వందమందిలో 58 మందికి పైగా రక్తహీనత సమస్యతో సతమతమవుతున్నారు. సరైన పౌష్టికాహారం లేకపోవడం, దీన్ని నివారించేందుకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడం వల్ల అనేక జబ్బులకు గురవుతున్నారు. మహిళల్లో సగటున 11 శాతం హిమోగ్లోబిన్ ఉండాలి. కానీ 25 ఏళ్ల వయసున్న మహిళల్లో హిమోగ్లోబిన్ 8 శాతం కూడా లేని పరిస్థితి. చాలామంది మహిళలు రక్తహీనత కారణంగా జబ్బులకు గురైనప్పుడు త్వరగా కోలుకోలేకపోతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

గర్భిణుల్లో ప్రమాదక పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో ఏడాదికి 80 వేలకు వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో 55 శాతం మందికి పైగా రక్తహీనతతోనే బాధపడుతున్నారు. సివియర్ ఎనీమియా (అత్యల్పంగా రక్తం ఉండటం) వల్ల ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో ఐరన్, విటమిన్ మాత్రలు అందుబాటులో ఉండడం లేదు. యాంటీనేటల్ చెకప్ (గర్భిణిగా ఉన్నప్పుడు నెలసరి వైద్యపరీక్షలు)కు వచ్చినప్పుడు రక్తహీనత ఉన్నా...ఐరన్, విటమిన్ టాబ్లెట్లు ఇవ్వడం లేదని గర్భిణులు చెబుతున్నారు. రక్తహీనత వల్ల ఎక్కువ మంది సుఖ ప్రసవం కాలేకపోతున్నారు. అంతేకాదు ప్రసవ సమయంలో మాతృ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. స్టిల్ బర్త్ (కడుపులోనే బిడ్డ మృతి చెందడం) వంటివి జరుగుతూ తల్లికీ గండంగా మారింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సగటున 58 శాతం మందికి పైగా గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నట్టు తేలింది. సమయానికి ఆస్పత్రుల్లో ఐరన్, విటమిన్ మాత్రలు లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రక్తహీనత సంకేతాలు

- శారీరకంగా బలహీనంగా ఉండడం
- శరీరం పసుపు రంగులో ఉండడం
- శ్వాస సరిగా తీసుకోలేకపోవడం
- ఛాతీలో అప్పుడప్పుడూ నొప్పి రావడం
- అరచేతులు, అరికాళ్లు చల్లగా ఉండడం
- తరచూ తలనొప్పి వస్తుండడం

మహిళల్లో రక్తహీనత శాతం

ఉమ్మడి జిల్లా	రక్తహీనత శాతం
అనంతపురం	58.6
చిత్తూరు	48.8
కర్నూలు	54.5
వైఎస్సార్ జిల్లా	57.7

తల్లీబిడ్డకు ప్రమాదమే



రక్తహీనతతో తల్లీబిడ్డకు ఇద్దరికీ ప్రమాదమే. గ్రామీణ ప్రాంతాల నుంచి ఇప్పటికీ రక్తహీనత కేసులు వస్తున్నాయి. రక్తహీనతతో గర్భిణికి బీపీ ఎక్కువై పుట్టే పిల్లల్లో ఎదుగుదల ఉండదు. గర్భం దాల్చినప్పటి నుంచి గైనకాలజిస్టును సంప్రదించి వైద్యం చేయించుకోవాలి.
– డాక్టర్ మల్లిక, గైనకాలజిస్ట్, సర్వజనాస్పత్రి

పట్టు ప్రోత్సాహకాలు అందించాలి

హిందూపురం: పట్టు రైతులకు, రీలర్లకు ప్రోత్సాహకాలను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సిద్ధారెడ్డి, సిల్క్ రీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఖాజ, కార్యదర్శి ముస్తఫా మండిపడ్డారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత పట్టు రైతులు, రీలర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రోత్సహకాలు దాదాపు రూ. 60 కోట్లు విడుదల కావాల్సి ఉండగా, ఒక్క హిందూపురంలోనే సుమారు రూ.6కోట్ల వరకు బకాయిలు అందాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బకాయి ప్రోత్సహకాలు విడుదల చేసి పట్టు రైతులు, రీలర్లను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో పట్టు రైతు సంఘం నాయకులు నవీన్, పట్టు రీలర్స్ అసోసియేషన్ నాయకులు ఎ. బాషా, దాదాపీర్, ఖలీల్, రహీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్ (ఫైల్)

అమరాపురం: కర్ణాటకలో చోటు చేసుకున్న ప్రమాదంలో అమరాపురం మండలానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు... గౌడనకుంట గ్రామానికి చెందిన జయన్న కుమారుడు అజయ్ (19) ఇంటర్ పూర్తి చేసి, బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం తన విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గదికి వెళుతున్న క్రమంలో బెంగళూరులోని నాగసంద్ర సమీపంలో లారీ ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బెంగళూరు నుంచి మృతదేహాన్ని శుక్రవారం తీసుకురానున్నట్లు సమాచారం.

వ్యాపారి ఇంట్లో రేషన్ బియ్యం డంప్

- నిల్వలు చూసి కంగుతిన్న విజిలెన్స్ అధికారులు
- వెలికి తీస్తున్న కొద్దీ బయట పడుతున్న బియ్యం బస్తాలు



ఇంట్లో నిల్వ ఉంచిన బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

కణేకల్లు: స్థానిక ఓ బియ్యం వ్యాపారి ఇంట్లో భారీగా రేషన్ బియ్యం డంప్ బయటపడింది. అక్కడి నిల్వలు చూసి ఏకంగా విజిలెన్స్ అధికారులే కంగుతిన్నారు. వివరాలు... కణేకల్లులోని రామనగర్‌లో నివాసముంటున్న బియ్యం వ్యాపారి గవిరాజు ఇంటిని శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంట్లో రెండు గదుల్లో భారీ స్థాయిలో పేర్చిన రేషన్ బియ్యం బస్తాలను గమనించి విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా, డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, ఆర్‌ఎస్ డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్‌నాయక్, స్థానిక వీఆర్వో పవన్‌కుమార్ ఒక్కసారిగా నిశ్చేష్టులయ్యారు. 20, 30, 40 కిలోల లెక్కన బస్తాలుండటంతో మొత్తం ఎన్ని క్వింటాళ్ల బియ్యం ఉందో లెక్కించడం సాధ్యం కాక, చివరకు ఓ లారీని రప్పించి అందులో లోడ్ చేసి ఎఫ్‌సీఐ గోదాముకు తరలించారు. గవిరాజుపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కర్ణాటక తొలి విజయం

- సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం
- పేలవమైన ఆట తీరుతో చతికిలబడిన ఆంధ్ర
- రెండో మ్యాచ్‌లో అండమాన్ నికోబార్‌పై తమిళనాడు భారీ గెలుపు
- ఏపీలో ఫుట్‌బాల్ అభివృద్ధికి చర్యలు : కళ్యాణ్ చౌబే



ఆట ప్రారంభోత్సవంలో ఏపీ, కర్ణాటక జట్ల క్రీడాకారులతో ముఖ్యఅతిథులు



ఆంధ్ర డిఫెండర్ల వలయం నుంచి బంతిని తరలించుకెళుతున్న కర్ణాటక క్రీడాకారుడు

అనంతపురం: సంతోష్ ట్రోఫీ తాజా సీజన్‌లో కర్ణాటక, తమిళనాడు జట్లు తొలి విజయం నమోదు చేసుకున్నాయి. శుక్రవారం అనంత క్రీడాగ్రామం వేదికగా జరిగిన ప్రారంభ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుపై 5–0 గోల్స్ తేడాతో కర్ణాటక జట్టు భారీ విజయాన్ని నమోదు చేయగా... రెండో మ్యాచ్‌లో అండమాన్ నికోబార్ జట్టుపై 7–0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టు గెలుపొందింది. జోరున కురుస్తున్న వర్షంలోనే మ్యాచ్‌లు హోరాహోరీగా సాగడం గమనార్హం.

చెలరేగిన కన్నడిగులు..

ప్రత్యర్థి డిఫెన్స్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ కర్ణాటక జట్టు క్రీడాకారులు చెలరేగిపోయారు. ఆట ప్రారంభమైన తొలి 15 నిమిషాల వ్యవధిలోనే ఆంధ్ర జట్టుపై మూడు గోల్స్ చేసి ఆధిక్యతలో కొనసాగారు. దీంతో ఒత్తిడికి గురైన ఆంధ్ర క్రీడాకారులు కేవలం డిఫెన్స్‌కే పరిమితమవుతూ వచ్చారు. బంతిని ఎక్కువ సేపు అదుపులో పెట్టుకున్నా... అవి గోల్ కాకుండా కర్ణాటక క్రీడాకారులు అడ్డుకోవడం గమనార్హం. అనూహ్యంగా దక్కిన కార్నర్‌లు, ఆఫ్‌సైడ్‌లను సద్వినియోగం చేసుకోలేక చతికిలబడ్డారు. దీంతో రెండో హాఫ్‌లో మరో రెండు గోల్స్ చేసి కర్ణాటక శుభారంభం చేసింది.

తమిళుల ధాటికి తాళలేక...

రెండో మ్యాచ్‌లో తమిళనాడు జట్టు ముందు పేలవమైన ఆటతీరుతో అండమాన్ నికోబార్ జట్టు చతికిలబడింది. ఆట ప్రారంభం నుంచి అండమాన్ నికోబార్ జట్టుపై తమిళనాడు క్రీడాకారులు ఆధిక్యతను కొనసాగిస్తూ 7–0 గోల్స్ తేడాతో భారీ విజయాన్ని నమోదు చేశారు. అనంత క్రీడాగ్రామంలోని ఫుట్‌బాల్ స్టేడియంలో ఈ సీజన్‌కు ఇదే భారీ విజయం కావడం విశేషం.

ఫుట్‌బాల్‌కు విపరీతమైన క్రేజ్..

ప్రపంచంలో ఫుట్‌బాల్ క్రీడకు విపరీతమైన క్రేజ్ ఉందని జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్‌ఏ) ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ స్టేడియంలో సంతోష్ ట్రోఫీ–24 శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కళ్యాణ్ చౌబే, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్, ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. కళ్యాణ్ చౌబే మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. జేసీ శివనారాయణ శర్మ మాట్లాడుతూ.. సంతోష్ ట్రోఫీ టోర్నీని జిల్లాలో నిర్వహించడం గర్వకారణమన్నారు.

బుద్ధిమాంద్యులపై కూటమి నిర్దయ

- పింఛన్ కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు
- పెంచిన పింఛన్ అందజేయాలని వినతులు
- స్పష్టమైన ఆదేశాలు జారీ చేయని ప్రభుత్వం



సదరం సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి (ఫైల్)

రూ.15 వేలు పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వారు

బుద్ధిమాంద్యం	1,280 మందికి పైగా
డయాలసిస్ రోగులు	228 మంది
కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగులు	83 మంది
హెచ్‌ఐవీ బాధితులు	1,632 మంది
బోదకాలు బాధితులు	11 మంది
మొత్తం బాధితులు	3,234 మంది
రూ.15 వేలు పింఛన్ అందుతున్న వారి సంఖ్య	2,060

పుట్టపర్తి అర్బన్: నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారిన బుద్ధి మాంద్యులపై కూటమి ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్‌ను అందజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

స్పందనకు వెల్లువెత్తుతున్న వినతులు

ఎంత వయసు వచ్చినా తన పని కూడా చేసుకోలేక నిత్యం వీల్‌చైర్, మంచాలకే పరిమితమవుతున్నారు. ఓ కుటుంబంలో బుద్ధిమాంద్యం చిన్నారి ఉంటే వారి సంరక్షణతోనే మరొకరికి పూర్తి రోజు గడిచిపోతోంది. ఇలాంటి చిన్నారులకు పింఛన్ పెంచి ఇస్తామంటూ గత ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు హామీనిచ్చారు. అయితే అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్నా... కూటమి సర్కార్ హామీని నిలబెట్టుకోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల మేరకు 45 నుంచి 90 శాతం పైగా బుద్ధి వైకల్యంతో బాధపడుతున్న వారందరూ పింఛన్‌కు అర్హులు. వీరిలో చాలా మందికి అందుతున్న రూ.6 వేలు పింఛన్ వారి కనీస వైద్య ఖర్చులకూ సరిపోవడం లేదు. ఈ క్రమంలో పెంచిన రూ.15 వేలు పింఛన్ అందజేయాలంటూ ప్రతి వారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తుతున్నాయి.

కొంత మందికే రూ.15 వేలు పింఛన్

ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. 85 శాతం పైగా వైకల్యం ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.15 వేల పింఛన్‌ను అందజేస్తామని ఎన్నికల సమయంలో స్పష్టమైన హామీనిచ్చిన కూటమి పెద్దలు.. అధికారం చేపట్టిన తర్వాత హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడుతున్నారు. మంచానికి పరిమితమైన 1,256 మందికి, కండరాల బలహీనతతో బాధ పడుతున్న మరో 804 మందికి మొత్తంగా 2,060 మందికి మాత్రమే రూ.15 వేలు పింఛన్ అందుతోంది. కిడ్నీ బాధితులు, డయాలసిస్ చేయించుకుంటున్న వారు, బోదకాలుతో నడవలేనివారు. ఏ పనీ చేసుకోలేక ఇబ్బంది పడుతున్న హెచ్‌ఐవీ రోగులు, బుద్ధిమాంద్యం రోగులు ఇలా వేలాది మంది పెంచిన రూ.15 వేలు పింఛన్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ 85 నుంచి 100 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్లు ఉన్నాయి.

పుట్టినప్పటి నుంచి మంచంపైనే..



మా కుమారుడు లోచన్‌రెడ్డికి ప్రస్తుతం 12 ఏళ్లు. పుట్టినప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యాడు. ఎలాంటి పనికి వెళ్లకుండా ఎవరో ఒకరు ఇంటిపట్టునే ఉండాల్సి వస్తోంది. అన్ని అర్హతలూ ఉన్న పెంచిన పింఛన్ ఇవ్వడం లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చాం. ఒక్కసారి కలెక్టరేట్‌కు వచ్చి వెళ్లాలంటే రూ.వెయ్యికి పైగా ఖర్చు వస్తోంది.
– మమత, లోచన్‌రెడ్డి తల్లి, నాగప్పగారిపల్లి, తలుపుల మండలం

ఆన్‌లైన్‌లో రిజెక్ట్ చేస్తున్నారు



మా కుమారుడు ఆకలేస్తే అన్నం అడగలేడు, కనీసం మూత్రం వచ్చినా చెప్పలేడు. ఇలా నానా ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీ మేరకు మా కుమారుడు సతీష్‌నాయక్‌కు రూ.15 వేలు పింఛన్ మంజూరు చేయాలి. సచివాలయంలో అడిగితే ఆన్‌లైన్‌లో రిజెక్ట్ అవుతోందని అంటున్నారు. ఇప్పటికి ఇదే విషయంపై ఆరు సార్లు కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీలు ఇచ్చాను. అయినా సమస్య తీరలేదు. పెంచిన పింఛన్ అందజేస్తే మా కుమారుడికి కాస్త బలవర్ధక ఆహారం అందించేందుకు వీలవుతుంది.
– శాంతిబాయి, అదదాకులపల్లి, పెనుకొండ మండలం

ప్రభుత్వానికి నివేదించాం



85 శాతం పైబడి వైకల్యం ఉన్నవారు ఆశా కార్యకర్త, గ్రామంలో ఉండే ఏఎన్ఎంల సంతకంతో కూడిన లెటర్ తీసుకుని వచ్చిన వెంటనే వాటిని సర్టిపై చేసి నివేదిక పంపుతున్నాం. ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చిన వెంటనే సంబంధిత సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.
– డాక్టర్ మంజువాణి, డీఎంహెచ్‌ఓ, శ్రీ సత్యసాయి జిల్లా